వికారాబాద్, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రానికి చెందిన సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ సి వేణుగోపాలరావు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా కమ్యూనికేషన్ జర్నలిజంలో బుధవారం గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కుటుంబ సభ్యులు బంధుమిత్రులు అభినందించారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీ అందజేత

కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాలను అందిస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 28 : హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో మంజూరైన ఎల్‌వోసీ పత్రాలను బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అందజేశారు. నియోజకవర్గంలోని మద్దూర్ మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నర్సింహులుకు రూ.85వేలు, కోస్గి పట్టణానికి చెందిన సదానంద్‌కు రూ.లక్షా90వేలు, దౌల్తాబాద్ మండలం బాలంపేట గ్రామానికి చెందిన మనోజ్ఞకు రూ.2లక్షల70వేలు, చంద్రకల్ గ్రామానికి చెందిన నాగమ్మకు రూ.లక్షా50వేలు, బొంరాస్‌పేట గ్రామంలోని జహీరాబేగంకు రూ.2లక్షల10వేలకు సంబంధించి వారి కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ పత్రాలను పంపిణీ చేశారు.

ప్రజాప్రతినిధుల సేవలు మరువలేనివి

మాజీ సర్పంచ్, మాజీ వార్డు సభ్యులకు సన్మానం చేసిన ప్రత్యేక అధికారి, కార్యదర్శి

కులకచర్ల, ఫిబ్రవరి 28 : ప్రజాప్రతినిధుల సేవలను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటారని గ్రామ ప్రత్యేక అధికారి వీరస్వామి, తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కులకచర్ల మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటమ్మ, మాజీ వార్డు సభ్యులను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో సర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర గొప్పదని గ్రామాభివృద్ధికి వారు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఎంపీటీసీ రాంలాల్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సర్పంచ్ వార్డు సభ్యులు చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాములు, చిన్నయ్య, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

స్వచ్ఛంద సంస్థల సాయం అభినందనీయం

దోమ, ఫిబ్రవరి 28 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని సర్పంచ్‌ల సంఘం దోమ మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. బుధవారం దోమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు పేద విద్యార్థులకు కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ తరపున రూ.2500 చెక్కును మాజీ సర్పంచ్ రాజిరెడ్డి విద్యార్థులకు అందజేశారు. దోమ పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించేందుకు సాయం అందించాలని వారిని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రాములు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 28 : మండలంలోని బురాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. మొత్తం 13 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. వీరిని హెచ్ఎం స్రవంతి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సునీత అభినందించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తాండూరు, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగాయి. తాండూరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రెండు కేంద్రాలు, చైతన్య జూనియర్ కళాశాల, సింధూ బాలి కల జూనియర్ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాల, అంబేద్కర్ పారా మెడికల్ కళాశాల, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం ఫస్ట్ లాంగ్వేజ్ జనరల్ 1781 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1739 మంది రాసినట్లు కస్టోడియన్ మల్లినాథప్ప, కృష్ణయ్య తెలిపారు. అదే విధంగా ఒకేషనల్‌కు చెందిన 648 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 615 మంది రాసినట్లు తెలిపారు. పరీక్ష సెంటర్ దగ్గర 144 సెక్షన్ విధించడంతో పాటు పోలీస్ అధికారులు, స్పెషల్ స్క్వాడ్ బృందం పరీక్షా కేంద్రాలను పరిశీలించారు

కొడంగల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రంలో మొదటి సంవత్సరానికి చెందిన తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత పరీక్ష జరిగింది. 651మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 25మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల పర్యవేక్షకుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సీఐ రాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.

పెద్దేముల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న ఆయా కళాశాలల విద్యార్థులు

పెద్దేముల్: ఇంటర్ ఫస్టియర్ మొత్తం 218 మంది విద్యార్థులకుగాను 210 విద్యార్థులు హాజరయ్యారు. ఎస్ఐ కె.గిరి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. స్థానిక మండల తహసీల్దార్ కె.కిషన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజురెడ్డి పరీక్షా కేంద్రం వద్ద పరిస్థితులను సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కులకచర్ల : కులకచర్ల శ్రీరామలింగేశ్వర కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి, ఎంపీడీవో రమేశ్‌నాయక్ పరిశీలించారు.

పరిగి టౌన్: పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. చుట్టు పక్కల జిరాక్స్ కేంద్రాలను సైతం మూసివేయించారు. పరిగిలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 231 మంది హాజరైనట్లు తహసీల్దార్ గణేశ్ తెలిపారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ



కొడంగల్: సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్, ఫిబ్రవరి 28 : జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధి, మండల పరిధిలోని బుధవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో సీవీ రామన్‌కు ఘన నివాళి అర్పిస్తూ.. సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమం పలువురిని ఆకట్టుకున్నది. విద్యార్థులు తయారు చేసిన పరికరాలను సందర్శనకు వచ్చినవారికి వివరించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం సైన్స్‌పైనే ఆధారపడి ఉందని, నేడు అంతరిక్షంలోకి అడుగు పెట్టడం వంటి ఎన్నో పురోగతులు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై పట్టు ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం. మురళీధర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికారాబాద్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంకల్ప్ విద్యాపీఠంలో సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు వారి మేధాశక్తిని ఉపయోగించి వివిధ రకాల ప్రయోగాలను తయారు చేశారు. ఈ ప్రయోగాలను ఇతరులకు చక్కగా వివరించారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

పరిగి టౌన్: ప్రదర్శనను తిలకిస్తున్న మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్

పరిగి టౌన్: ఇంటర్నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని పరిగి పట్టణంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పాల్గొని విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, మునీర్, మీర్ తాహెర్‌అలీ, మౌలానా, రవికుమార్, ఆకారపు రాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని వివిధ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ ఉన్నత పాఠశాలలో 20 జీవశాస్త్ర ప్రయోగాలు, 20 భౌతిక శాస్త్ర ప్రయోగాలు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికారాబాద్: వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

కొడంగల్ సీహెచ్‌సీకి కేబీఎస్ బ్యాంకు అంబులెన్స్ అందజేత



కొడంగల్ సీహెచ్‌సీ ఆసుపత్రికి అంబులెన్స్‌ను అందిస్తున్న కేబీఎస్ బ్యాంకు అధికారులు

కొడంగల్, ఫిబ్రవరి 28 : అత్యవసర సేవలకు అంబులెన్స్ సేవలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని డీసీహెచ్ఎస్ డా.ప్రదీప్ తెలిపారు. బుధవారం స్థానిక కేబీఎస్ బ్యాంకు స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి నూతన అంబులెన్స్ వాహనాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ సివిల్ ఆసుపత్రి ప్రస్తుతం 50 పడకలుగా ఉందని.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి 220 పడకల ఆసుపత్రిగా మార్చడంతోపాటు టీచింగ్ ఆసుపత్రిగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆసుపత్రి వైద్య సేవలు గణనీయంగా పెరుగనున్నాయని.. ఇటువంటి సమయంలో కేబీఎస్ బ్యాంకు వారు అందించిన అంబులెన్స్ ఉపయోగం ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. ఆసుపత్రికి అంబులెన్స్ అందించడంపై ప్రత్యేకంగా కేబీఎస్ బ్యాంకు బృందానికి అభినందనలు తెలిపారు. పరిగి ఆసుపత్రికి కూడా ఇదేమాదిరిగా అంబులెన్స్‌ను అందించాలని కేబీఎస్ బ్యాంకు అధికారులను కోరారు.

కేబీఎస్ బ్యాంకు ఎండీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కేబీఎస్ బ్యాంకు 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడంగల్ ఆసుపత్రికి అంబులెన్స్ అందించినట్లు తెలిపారు. కేబీఎస్ బ్యాంకు వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధిని సాధించిందని, లాభాల బాటలో బ్యాంకు పయనిస్తున్నదన్నారు. వచ్చిన లాభాల్లో సమాజ సేవకు ఉపయోగపడేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో కర్ణాటకతోపాటు ఆత్మకూర్ ఆసుపత్రులకు అంబులెన్స్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కేబీఎస్ బ్యాంకు సీజీఎం సత్యనారాయణ, సీఎఫ్‌వో మురళీ కృష్ణ, కొడంగల్ కేబీఎస్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్ఎస్ ఆసుపత్రి సూపరింటెండెట్ డా.చంద్రప్రియ, ఆసుపత్రి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో నీటిఎద్దడి తలెత్తవద్దు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల ఎంపీడీవో పాండును సన్మానిస్తున్న ఎంపీపీ మల్లేశం, చైర్మన్ సతీష్‌రెడ్డి

పూడూరు, ఫిబ్రవరి 28 : గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీపీ మల్లేశం పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మల్లేశం మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నదన్నారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశంలో ప్రత్యేక పనుల తీర్మానాలు చేయలేకపోతున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్ డబ్బులు 90 శాతం రైతులకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ పీఎం కిసాన్ డబ్బులు రాని రైతులు వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఈకేవైసీ చేసుకొని భూమి పత్రాలను వ్యవసాయాధికారులకు ఇవ్వాలన్నారు. సర్వసభ్య సమావేశానికి రాని ఆయా శాఖల అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ పి.సతీశ్‌రెడ్డి సభలో కోరారు. అనంతరం బదిలీపై కొత్తగా వచ్చిన ఎంపీడీవో పాండును ఘనంగా సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ మేఘమాల, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేందర్, రామకృష్ణారెడ్డి, బి.నాగమణి, సల్మాబేగం, శ్రీదేవిక, యాదమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

కొడంగల్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని కార్గిల్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వీర ఆంజనేయస్వామి దేవాలయలో ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా కొనసాగింది. గత రెండు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ధాన్యాదివాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులిచ్చి, తీర్థ ప్రసాదాలతో పాటు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా

పూడూరు, ఫిబ్రవరి 28: పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని, స్థావరాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు చన్గోముల్ పోలీస్ స్టేషన్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి పూడూరు మండల పరిధిలో ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ప్రత్యేక పోలీస్ బృందం వెళ్లి పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.51వేల నగదు, మూడు కార్లు, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నిరంతర గస్తీలు నిర్వహించనున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు షురూ

అమ్మవారి ఉత్సవ విగ్రహం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 28 : దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవత బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు ఎంతో ఘనంగా జరిగే ఉత్సవాలకు నేడు ఎల్లమ్మ తల్లి రాకతో అంకురార్పణ జరగనున్నది. పోలేపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం నుంచి ప్రధాన దేవాలయం వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గురువారం రాత్రి ఊరేగింపుగా తీసుకొస్తారు. రాత్రి 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు శుక్రవారం తెల్లవారుజాము 4 గం టల వరకు కొనసాగుతుంది. ప్రధాన దేవాలయానికి అమ్మవారు చేరుకోవడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పల్లకి సేవతో పాటు శుక్రవారం నిర్వహించే సిడె ఉత్సవానికి దేవస్థానం కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతర మైదానంలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం, మొక్కుల కోసం దూర ప్రాంతాల నుంచి భక్తులు పోలేపల్లికి చేరుకుంటున్నారు.

ఆలయానికి విరాళం

దోమ, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని పాలేపల్లి గ్రామ వరవీర ఆంజనేయ స్వామి ఆలయానికి గ్రామ శివస్వామి జోగు దస్తయ్య దేవాలయ పెయింటింగ్ నిమిత్తం రూ.ఐదు వేల విరాళాన్ని గ్రామ శివస్వాములకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు నర్సింహులు, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కులకచర్ల, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని నిరుపేద వ్యక్తి వడ్డె వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య ద్వారా రూ.ఐదువేలు ఆర్థిక సాయం అందించారు.

పరీక్షల సమయానికి బస్సులు నడపాలి

పూడూరు, ఫిబ్రవరి 28 : ఇంటర్‌మీడియట్ విద్యార్థుల పరీక్షల సమయానికి ఆర్టీసీ బస్సులను నడపాలని తిర్మలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పెంటయ్య కోరారు. బుధవారం పరిగిలోని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఉదయం, మధ్యాహ్నం విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని పూడూరు, రాకంచర్ల, సోమన్‌గుర్తి, మంచన్‌పల్లి, మేడికొండ గ్రామాల విద్యార్థులు పరిగిలో చదువుకుంటున్నారని తెలిపారు. డిపో మెనేజర్‌కు వినతి పత్రం ఇవ్వడంతో ఆయన స్పందించి ఇంటర్ పరీక్షల సమయంలో వారికి అనుకూలమైన సమయంలో బస్సులు నడుపుతామని తెలిపినట్లు మాజీ సర్పంచ్ పెంటయ్య తెలిపారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

మర్పల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని కోటమర్పల్లిలో గురువారం నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ, పరశురాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 1:18 గంటల నుంచి 2:30 మధ్యలో రేణుకా-పరశురాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని, శుక్రవారం ఉదయం 9:55 అమ్మవారికి బోనాలు, పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Miryala Village కి చెందిన Valaboju Shiva Kumari D/o V. Narsimha Chary, aged 42 years, Occ: House hold R/o Miryala Village, Bommalaramavaram Mandal, Nalgonda Dist., **Applicant / Borrower** నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ గారికి ఇల్లీ ఆస్తిని తనఖా (Mortgage) పెట్టి అప్పు తీసుకోవటానికి దరఖాస్తు చేసియున్నారు. ఇల్లీ ఆస్తి విషయములో ఎవరికైనా ఎలాంటి హక్కుగాని, ఆక్షేపణలు గాని ఉన్నయెడల ఈ క్రింది అడ్రస్సుకు (3) రోజుల లోపల తెలియజేయగలరు. లేని పక్షంలో ఇల్లీ ఆస్తిపై ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి నా క్లయింట్ అయిన శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు షెడ్యూల్ ఆస్తిని తనఖా పెట్టుకొని అప్పును మంజూరు చేయుదురు. తరువాత వచ్చిన ఆక్షేపణలు చెల్లనేరవు.
ఆస్తి వివరాలు: Part of Residential house No.9-116 an extent of 140 Sq.yards, situated within the limits of Kushaiguda, Kapra Municipality, Keesara Mandal, Rangareddy Dist.
హద్దులు : East : Lane, **West:** Lane, **North:** Part of H.No.9-116, **South:** H.No.9-115.
K. CHANDRA MOULI B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

కులకచర్ల, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నుంచి శివస్వాములు శ్రీశైలాని బయలుదేరి వెళ్లారు. బండవెల్కిచర్ల ఎంపీటీసీ జ్యోతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడులు కట్టుకొని శ్రీశైలానికి పాదయాత్రగా బయలు దేరి వెళ్లారు. శివస్వాములు 41 రోజులు దీక్షను ముగించుకొని విరమించేందుకు శ్రీశైలాని వెళతారు. రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శివస్వాములు ఓం నమః శివాయ అంటూ పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ పాదయాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు, పూజారులు పాల్గొన్నారు.

కొడంగల్: శ్రీశైలంలోని మల్లన్నను దర్శించుకునేందుకు మండలంలోని హస్నాబాద్, ఇందనూర్, కస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన శివ స్వాములు పాదయాత్రగా బుధవారం తరలివెళ్లారు.

అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు

కులకచర్ల, ఫిబ్రవరి 28 : గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని కులకచర్ల ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం కులకచర్ల మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామంలో నమ్మదగిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన బరిపెట్టి గోపాల్ అనే వ్యక్తి తన కిరాణ దుకాణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు దొంగతనంగా జరుగుతున్నాయని.. అలా చేసినట్లు తమ దృష్టికి వస్తే మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ ఇబ్రహీంపట్నం/మహేశ్వరం } 80966 77668 : 80966 77962